క్లుప్తంగా

అర్చకుడికి సన్మానం



భీమదేవరపల్లి : మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో ముఖ్య అర్చకుడిగా పదోన్నతి పొందిన మొగిలిపాలెం రాంబాబును అర్చకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. రాంబాబు అర్చకుడిగా సేవలు అందిస్తూ ఇటీవలే ముఖ్యఅర్చకుడిగా పదోన్నతి పొందడం పట్ల అర్చకులు హర్షం వ్యక్తం చేశారు. రాంబాబు అర్చకుడిగా ఎనలేని సేవలు అందిస్తున్నాడని కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం మండల శాఖ అధ్యక్షుడు నాగిళ్ల కృష్ణమూర్తి శర్మ, సదాశివ శర్మ, ధూప దీప నివేదన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానకిపురం రవిశర్మ, వాసు, సతీష్ పాల్గొన్నారు.

కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై చర్యలు తీసుకోవాలి

శాయంపేట : టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ గౌడ్‌ను చంపుతామని బెదిరించిన భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర నాయకుడు దామెరకొండ కొమరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుధాకర్ తండ్రి ఉషాగౌడ్ కమ్యూనిస్టు పార్టీ నేతగా ప్రజలకు ఎనలేని సేవలు అందించారని, ఆయన అడుగుజాడల్లోనే సుధాకర్ ప్రజాసేవలో నాయకుడిగా ముందుకు సాగుతున్నారని చెప్పారు. స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రజాసంఘాలు, పౌర హక్కుల తరఫున పోరాడిన వ్యక్తిగా సుధాకర్‌ను అభివర్ణించారు. సుధాకర్‌కు వస్తున్న ప్రజాదరణను ఓర్వలేకే వెంకటరెడ్డి బెదిరించారని ధ్వజమెత్తారు. సమావేశంలో నాయకులు శ్రీను, సతీష్, యుగేందర్, అశోక్, రాజు, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

'క్షమాపణ చెప్పాలి'

కాజీపేట అర్బన్: చెరుకు సుధాకర్‌గౌడ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. భేషరతుగా క్షమాపణ చెప్పాలని గోపా జిల్లా అధ్యక్షుడు చిర్ర రాజుగౌడ్ డిమాండ్ చేశారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని గోపా భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాధనలో క్రియాశీల పాత్ర పోషించి, ఉచిత వైద్యం అందిస్తూ నిరుపేదల ప్రాణాలు నిలబెట్టిన బహుజన నాయకుడు చెరుకు సుధాకర్‌గౌడ్ అని గుర్తుచేశారు. అలాంటి వ్యక్తిని హత్య చేయిస్తానని బెదిరించడం శోచనీయమని వాపోయారు. వెంకటరెడ్డి క్షమాపణ చెప్పకుంటే గోపా ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని రాజుగౌడ్ హెచ్చరించారు. కార్యక్రమంలో గోపా రాష్ట్ర కార్యదర్శి రాజేష్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, కోశాధికారి చిర్ర ఉపేందర్, గౌరవ అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, సునీల్, సాంబయ్య, రాజేందర్, శ్రీనివాస్, సుధాకర్, రమేష్ పాల్గొన్నారు.

నేటి బీటెక్ పరీక్ష వాయిదా

కేయూ క్యాంపస్: ఈనెల 8న కాకతీయ యూనివర్సిటీ పరిధిలో జరగనున్న బీటెక్ మొదటి సంవత్సరం పరీక్షను అంతర్జాతీయ మహిళా దినోత్సవం దృష్ట్యా వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి మంగళవారం తెలిపారు. మిగితా పరీక్షలు యధావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

నేడు శిల్పాల్లోకి ఉచిత ప్రవేశం

ఖిలా వరంగల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ కోటలోని శిల్పాల ప్రాంగణంలోకి పర్యాటకులు, సందర్శకులకు ఎలాంటి రుసుము లేకుండా బుధవారం ఉచిత ప్రవేశం కల్పించనున్నట్లు కేంద్ర పురావస్తుశాఖ జిల్లా అధికారి మడిపెల్లి మల్లేశం మంగళవారం ఒక ప్రటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పర్యాటకులకు ఉచితంగా ప్రవేశానికి అనుమతి కల్పిస్తున్నట్లు తెలిపారు.

14నుంచి కేయూ ఎంసీఏ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్ : కేయూ ఎంసీఏ మొదటి సంవత్సర మొదటి సెమిస్టర్ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలు ఈనెల 14 నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు. ఈనెల 14, 16, 18, 20, 23 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వారు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పూజలు

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భీమారంలోని ఆలయంలో ఎమ్మెల్యే అరూరి రమేష్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శోభాయాత్రలో ఎమ్మెల్యే రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా హోలీ వేడుకలు

పరకాల, వేలేరు, శాయంపేట, ఎల్కతుర్తి, దామెర, నడికూడ, కమలాపూర్, ఐనవోలు, ధర్మసాగర్, ఆత్మకూరు, భీమదేవరపల్లి మండలాల్లోని ఊరూరా ప్రజలు హోలీ వేడుకలు జరుపు కున్నారు. చిన్నాపెద్దా, ఆడమగ తేడా లేకుండా జనం ఒకరికొకరు రంగులు పూసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చెరువులు, కుంటల వద్దకు ఎవరూ వెళ్లకుండా పోలీసులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



పరకాల : డ్యాన్స్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, న్యాయవాదులు, జనం



దామెరలో..



కమలాపూర్ : మర్రిపెల్లిగూడెంలో..



శాయంపేటలో..



ఆత్మకూరులో..



ఎల్కతుర్తిలో..



భీమదేవరపల్లి : ముల్కనూరులో..

పేదలకు అండగా నిలవడమే లక్ష్యం

● కన్వీనర్ గుంటిపల్లి రేణుక వెంకట్

ధర్మసాగర్ : పేదలకు అండగా నిలవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ముప్పారం గ్రామ పరిరక్షణ సమితి, రామక్క చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ గుంటిపల్లి రేణుక వెంకట్ తెలిపారు. మండలంలోని ముప్పారంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మంగళవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా రేణుక వెంకట్ మాట్లాడారు. ఇప్పటికే గ్రామానికి చెందిన పలువురు పేదలు హైదరాబాద్, వరంగల్ లాంటి నగరాల్లో వైద్యం చేయించుకోగా లక్షలాది రూపాయల సాయం అందించినట్లు తెలిపారు. ఇక నుంచి ఎవరు మృతి చెందినా వారి కుటుంబాలను ఆదుకునేలా ఆర్థికసాయం అందించడానికి నిర్ణయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తాళ్లపల్లి వెంకన్న, బొనగాని సమ్మయ్య, కోతి సాంబరాజు, వెంకట్రాజం, ముంజ మహేందర్ గౌడ్, ముక్కెర రవి, ముంజ రాజు, గుంటిపల్లి రాజు, పన్నీరు రాజబాబు, గౌడ సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఎస్సైకి అభినందనల వెల్లువ



దామెర : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ముత్యం రాజేందర్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. ఆయన్ను ఎంపీపీ కాగితాల శంకర్, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, ఆత్మకూరు రైతుబంధు కోఆర్డినేటర్ ఎన్కతాళ్ల రవీందర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా పని చేయాలని ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన పోలీసు సేవలు అందించాలని కోరారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

హన్మకొండ: మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని మంగళవారం రాత్రి జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా మహిళల అభివృద్ధి, వారి సంక్షేమాన్ని పట్టించుకోలేదని అన్నారు. ఈనెల 8న కాకతీయ యూనివర్సిటీలో రాష్ట్ర మహిళా కమిషనర్, రాష్ట్ర మంత్రులతో మహిళా దినోత్సవం జరుపుకోనున్నట్లు వివరించారు. టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, బీఆర్‌ఎస్ పశ్చిమ నియోజకవర్గ కోకన్వీనర్ తాళ్లపెల్లి జనార్దన్ గౌడ్, మహిళా కార్పొరేటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

పీహెచ్‌డీ డిగ్రీ ప్రదానం

న్యూశాయంపేట: హనుమకొండలోని సుబేదారి ప్రాంతానికి చెందిన డాక్టర్ మహ్మద్ ముజాహిద్ ఇర్ఫాన్‌కు జేఎన్‌టీయూ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగం హైదరాబాద్ విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ డిగ్రీ ప్రదానం చేసింది. ఇంటరాక్టివ్ డిస్ట్రిబ్యూటెడ్ జనరేషన్ కోసం ఏఎన్‌ఎన్ ఆధారిత కంట్రోలర్‌ను ఉపయోగించి వోల్టేజ్ సోర్స్ ఇన్వెర్టర్ నియంత్రణపై డాక్టర్ మహ్మద్ ముజాహిద్ ఇర్ఫాన్ పరిశోధన చేశారు. ప్రొఫెసర్ చంద్రశేఖర్, కో గైడ్ ప్రొఫెసర్ సుష్మా జాయింట్ గైడెన్స్‌లో ఇర్ఫాన్ తన పరిశోధనను పూర్తి చేశారు.

ఘనంగా వేణుగోపాలస్వామి నాగవెల్లి



గజవాహనంపై ఊరేగుతున్న స్వామివారి రథం వద్ద భక్తులు

మడికొండ: కాజీపేట మండలం మడికొండ 64వ డివిజన్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి పూర్ణాహుతి, సాయంత్రం 6గంటల వరకు రాత్రి 10గంటల వరకు స్వామివారిని గజవాహనంపై గ్రామంలోని పుర వీధుల్లో ఊరేగించారు. అలాగే, బండ్ల తీర్థం, నాగవెల్లి ఏకాంతసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రజలు హారతులు ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు నిగ్గుల సతీష్‌కుమార్, ఉపాధ్యక్షుడు కడార్ల నరేందర్, దండిగం శ్రీనివాస్, కల్లెపు నరేష్, నార్లగిరి సతీష్, పత్తిపాక ఉపేంద్రచారి, రవీందర్, బోగి దయాకర్, డాక్టర్ తుమ్మ యాదగిరి, కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి, మెట్టుగుట్ట చైర్మన్ దువ్వ నవీన్, మాజీ మెట్టుగుట్ట చైర్మన్ అల్లం శ్రీనివాస్, దువ్వ శ్రీకాంత్, కంచనపల్లి వెంకటయ్య, పెండ్లి కృష్ణమూర్తి, బైరి లింగమూర్తి, ఓర్సు రాజు, అర్చకులు వెలగలేటి కృష్ణమాచార్యులు, ముస్కే శ్రీకాంత్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజస్వామి ఊరేగింపు

వరంగల్ చౌరస్తా: వరంగల్ గోవిందరాజుస్వామి డోలోత్సవం మంగళవారం వైభవంగా సాగింది. హోలీ వసంత మహోత్సవం సందర్భంగా స్వామి వారిని ఆలయం నుంచి మేళతాళాలతో గోవిందరాజుల గుట్ట, గిర్మాజీపేట ప్రాంతాల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు వరయోగుల శ్రీనివాసస్వామి, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్, అర్చకులు లక్ష్మణ స్వామి, వేణుమాధవ్, జగన్నాథం, కిరణ్, వెంకటేశ్వర్లు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సమావేశానికి ఆహ్వానం

ఎంజీఎం : రాజస్తాన్ రాష్ట్రంలోని బికనూర్ జిల్లాలో ఈనెల 11, 12వ తేదీల్లో జరగనున్న అంతర్జాతీయ సామాజిక సేవా సమావేశానికి వరంగల్ నేత్ర దాతల అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, సలహాదారు రాజేంద్రప్రసాద్, శంకర్‌యాదవ్‌లను ఆహ్వానించారు. ఈ సమావేశాన్ని వరల్డ్ రికార్డు, రిటైర్డ్ ఆర్మీ మేవాసింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేశంలోని ఆయా రాష్ట్రాల్లో విభిన్నమైన సేవా రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న సామాజిక సేవా కార్యకర్తలను సమావేశానికి ఆహ్వానించి రెండు వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మాజీ ఎంపీపీ యాదగిరి మృతి

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు గోనెల యాదగిరి (56) గుండెపోటుకు గురై హఠాన్మరణం చెందారు. నాలుగు రోజుల రోజుల క్రితం యాదగిరికి గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. యాదగిరి మృతి పట్ల పలు పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. 2006లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎర్రగట్టుపల్లి ఎంపీటీసీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన యాదగిరి.. రెండు ఓట్ల మెజార్టీతో గెలిచారు. మండలంలో మొత్తం 21 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, స్వతంత్ర అభ్యర్థులు రెండు స్థానాల్లో గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ ఎంపీటీసీలు ఉన్నప్పటికీ ఎంపీపీకి కావాల్సిన మెజారిటీ లేదు. బీసీ రిజర్వేషన్ కావడంతో గోనెల యాదగిరి కింగ్‌మేకర్ పాత్ర పోషించారు. గోనెల యాదగిరిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుని ఎంపీపీగా పదవిని కట్టబెట్టారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

ఖిలా వరంగల్: రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయిన ఘటన వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం సమీపంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం హోలీ వేడుకల్లో పాల్గొన్న ఇద్దరు యువకులు బైక్‌లపై ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు ఆ రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దాంతో ఇరువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎమ్మెల్యే నరేందర్ ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి..

కాజీపేట: వేగంగా వెళ్తున్న ఓ లారీ అదుపు తప్పి రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొనడంతో అతడు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి కథనం ప్రకారం నేరేళ్ల సాంబయ్య (50) అనే వ్యక్తి కడిపికొండ క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా ఖమ్మం వైపు వెళ్తున్న లారీ అతన్ని ఢీకొట్టింది. దాంతో అతని శరీర భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. 108 సర్వీసులో ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

లక్ష్మీదేవి జయంతి వేడుకలు



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో లక్ష్మీదేవి జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు అయినవోలు అనంత మల్లయ్య శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో లక్ష్మీదేవికి అర్చకులు పంచామృతాలతో పాటు నదీ జలాలతో అభిషేకాలు, అర్చనలు జరిపించారు. భక్తులు సమర్పించిన నూతన వస్త్రాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అన్నపూర్ణ భవనంలో భక్తులందరికి మహాన్నదానం నిర్వహించారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం



పట్టువస్త్రాలతో వస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి



స్వామి వారి కల్యాణంలో భక్తులు, అర్చకులు

దామెర : మండలంలోని కొగిల్వాయిలోని శ్రీ చంద్రగిరి చెన్నకేశవస్వామి కల్యాణం మంగళవారం కన్నుల పండువగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ శాశ్వత చైర్మన్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గట్ల విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు దివి వెంకటజోగాచార్యులు వేద మంత్రోచ్ఛారణల నడుమ శ్రీదేవి భూదేవి సహిత చెన్నకేశవస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అర్చన, అభిషేకాలు నిర్వహించారు. కల్యాణానికి పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి దంపతులు హాజరై స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం ఎమ్మెల్యే ధర్మారెడ్డి మాట్లాడారు. చెన్నకేశవస్వామి ఆలయానికి ఎంతో ప్రాశస్త్యం ఉందన్నారు. ఆలయ అభివృద్ధి విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం తాగు నీటి, ఇతర వసతులు కల్పించడంలో ఎనలేని కృషి చేశారంటూ ఆలయ కమిటీ శాశ్వత చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిని అభినందించారు. వచ్చే జాతర నాటికి గుట్టపైకి సీసీ రోడ్డు వేయిస్తానని తెలిపారు. గుట్టమీదున్న చెన్నకేశవస్వామి ఆలయంతోపాటు శివాలయ, ఆంజనేయస్వామి ఆలయాలను అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకొస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కాగితాల శంకర్, వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) మాజీ చైర్మన్ చింతం సదానందం, దళితబంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, ఓగ్లాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అక్తర్, పీఏసీఎస్ డైరెక్టర్ గుండ చంద్రమోహన్, జాతర కమిటీ చైర్మన్ మేకల వంశీ, వైస్ చైర్మన్ సంగరబోయిన వేణు, నాయకులు ఎన్కతాళ్ల రవీందర్, దామెరుప్పుల శంకర్, ఉపసర్పంచ్ గోల్కొండ సాంబయ్య, అర్చకులు దివి మురళీధరాచార్యలు, దివి కేశవాచార్యులు పాల్గొన్నారు.

రామభద్రస్వామి-సీతాదేవి కల్యాణం

కమలాపూర్ : మండలంలోని మర్రిపల్లి శివారులోని శ్రీరామభద్రస్వామి ఆలయంలో రామభద్రస్వామి-సీతాదేవిల కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. మర్రిపల్లిగూడెంలోని శ్రీ రంగనాయకుల ఆలయం నుంచి సీతాదేవి, రామభద్రస్వామి విగ్రహాలను మర్రిపల్లిలోని రామభద్రగుట్టకు తీసుకొచ్చి మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ కల్యాణం జరిపించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు చందుపట్ల రజిత సరోత్తం రెడ్డి, ఇనుగాల కిరణ్మయి విజయ్, పీఏ సీఎస్ చైర్మన్ సంపత్‌రావు, ఆర్బీఎస్ కన్వీనర్ శ్రీనివాస్, నాయకులు తడక శ్రీకాంత్, లాండిగె లక్ష్మణ్ రావు, నవీన్‌కుమార్, విజన్ ట్యుటోరియల్స్, కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు జక్కు భిక్షపతి, ఎంపీటీసీలు, జాతర కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు మంజూరు.. సంబురాలు

భీమదేవరపల్లి : రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని మల్లారం నుంచి ఇచ్చులపల్లి మీదుగా కన్నారం గ్రామం వరకు బీటీ రోడ్డు మంజూరు చేయడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు మండలంలోని మల్లారంలో మంగళవారం సంబురాలు నిర్వహించారు. సీఎం కేసీఆర్, హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి స్థానికంగా స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గూడెల్లి రాజిరెడ్డి, ఎంపీటీసీ గుగులోతు లలిత శ్రీనివాస్ మాట్లాడారు. ఎమ్మెల్యే సతీష్ కుమార్ చొరవ తీసుకోవడంతో సీఎం ప్రత్యేక నిధుల నుంచి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.6.60 కోట్లు మంజూరు కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అనేక దశాబ్దాలుగా ప్రజలు పడుతున్న రవాణా సమస్య పరిష్కారం కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింత రాజు, తిరుపతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మల్లారంలో సంబురాలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

హన్మకొండ: మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని మంగళవారం రాత్రి జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా మహిళల అభివృద్ధి, వారి సంక్షేమాన్ని పట్టించుకోలేదని అన్నారు. ఈనెల 8న కాకతీయ యూనివర్సిటీలో రాష్ట్ర మహిళా కమిషనర్, రాష్ట్ర మంత్రులతో మహిళా దినోత్సవం జరుపుకోనున్నట్లు వివరించారు. టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, బీఆర్‌ఎస్ పశ్చిమ నియోజకవర్గ కోకన్వీనర్ తాళ్లపెల్లి జనార్దన్ గౌడ్, మహిళా కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



పండ్లు పంపిణీ చేస్తున్న అసోసియేషన్ బాధ్యులు

న్యూశాయంపేట : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయం వద్ద ఉన్న ఎస్‌ఎస్ అపార్ట్‌మెంట్, సైకిల్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి, కార్యదర్శి అనంత కుమార్, నర్సయ్య, సత్యనారాయణ, రాజు, సీపీఎం నాయకులు ఎం.చుక్కయ్య, గొడుగు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ బ్రోచర్ ఆవిష్కరణ

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో కెమికల్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో ఆర్గానిక్ అండ్ మెడిసిన్ కెమిస్ట్రీ అనే అంశంపై నిర్వహించనున్న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ బ్రోచర్‌ను నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు మంగళవారం ఆవిష్కరించారు. నిట్ కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్ రాజేశ్వరరావు సేవలు అభినందనీయమని, ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కాన్ఫరెన్స్ కన్వీనర్లు డాక్టర్.బి.శ్రీనివాస్, కే.హరిప్రసాద్, నిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన యువతి కుటుంబీకులకు అప్పగింత

కాజీపేట: మతిస్థిమితం లేక తప్పిపోయిన యువతిని ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యులకు పోలీసులు మంగళవారం రాత్రి అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి కథనం ప్రకారం దర్గా కాజీపేట శివారు బంధం చెరువు ప్రాంతానికి చెందిన ఓదెలు కూతురు కొద్దికాలంగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఆమె ఆదివారం రాత్రి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు సోమవారం ఫిర్యాదు చేయగా ఎస్సై ప్రమోద్ కుమార్, క్రైమ్ కానిస్టేబుల్ ఆ యువతి ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించారు.